# 'లా'జిక్కు - మేజిక్కు

హత్యోదంతం. ముద్దాయి తరఫున ప్రముఖ న్యాయవాది ఒకరు ప్రాసిక్యూషన్ సాక్షిని క్రాస్ పరీక్ష చేస్తున్నారు.

"హత్య ఎన్ని గంటలకి జరిగింది?"

"రాత్రి తొమ్మిదింటికి సార్" అన్నాడు సాక్షి.

"ఆ సమయంలో నువ్వెందుకున్నావక్కడ?"

"భోజనం అయింతర్వాత కిళ్లీ వేసుకుందికని కిళ్లీ కొట్టుకి రావడం నాకలవాటు"

"ముద్దాయి కత్తితో పొడుస్తున్నప్పుడు నువ్వు చూశావా?"

"చూశాను సార్"

"అయితే హత్య చేయకుండా ముద్దాయిని నువ్వు ఎందుకు నివారించలేదు?" నిశితంగా సాక్షి ముఖంచూస్తూ ప్రశ్నించారు ఆ ప్రముఖ న్యాయవాదిగారు.

"ఆ సమయంలో నేను జోక్యం చేసుకుంటే నన్ను పొడిచేస్తాడేమోనని భయపడ్డాను సార్!" అన్నాడు సాక్షి.

"అంటే ఆ చంపబడిన వ్యక్తి, చనిపోవడం నీకిష్టం అన్నమాట! ఆ చనిపోయిన వ్యక్తికీ నీకూ ఏదో శత్రుత్వం వుంది. నువ్వు అసలు హంతకునితో కుమ్మక్కయి ముద్దాయి మీద ఆ హత్యా నేరాన్ని నెట్టేస్తున్నావంటాను!" అన్నారా ప్రముఖ న్యాయవాది.

ముద్దాయి తరఫున న్యాయవాది అడిగిందానికి తడబడ్డాడు ప్రాసిక్యూషన్ సాక్షి.

కేసు వాయిదా పడింది.

సగర్వంగా నల్లకోటు సవరించుకొంటూ, హుందాగా జూనియర్లతో కోర్టు మెట్లు దిగారు ముద్దాయి తరఫు న్యాయవాది.

ఎవరో ఒక సాధువుగారు ఉత్తరాదినుంచి ఆ వూరొచ్చి స్థానిక దేవాలయ ప్రాంగణంలో బసచేశారు. శూన్యంలోంచి విభూతి ప్రసాదాలు తీసి భక్తుల కిస్తున్నారని, అవి సేవించిన వారికి సకల రోగాలు నయం అవుతున్నాయని పుకార్లు బయల్దేరాయి. కార్లకి బ్రేకులుంటాయిగాని పుకార్లకి బ్రేకుల్లేవు కదా!

మన న్యాయవాదిగారు కూడా సతీసమేతంగా పట్టుబట్టలు కట్టుకుని సాధుమహరాజ్ దర్శనానికి వెళ్ళారు. దంపతులిద్దరూ సాధువుగారి కాళ్ళమీద పడి లేవగానే సాధువుగారు "భొంభొంభోలానాథ్" అంటూ శూన్యంలోంచి రెండు కోవా బిళ్ళలు తీసి న్యాయవాది గారి కిచ్చారు.

"మహా ప్రసాదం!" అని న్యాయవాదిగారు ముగ్ధులై పోయి, కోవా బిళ్ళల్ని కళ్ళకద్దుకుని నోట్లో వేసుకున్నారు.

"జై శంకర్ కైలాస్‌పతీ!" అంటూ రెండవసారి శూన్యంలోంచి విభూతి తీసిచ్చారు సాధువుగారు. "మహాప్రసాదం" అనుకుంటూ న్యాయవాదిగారు నొసట రాసుకున్నారు విభూతిని.

అనంతరం కొంత విభూతిని చేతపట్టుకుని ఇంటికెళ్ళి మనవలకూ్కడా ఇద్దామని పరమానందభరితులై పోయారు న్యాయవాదిగారు.

✿ ✿ ✿

తర్కశాస్త్ర ప్రవీణులైన లాయరుగారు ఆనాడు హత్యానేరం మోపబడ్డ ముద్దాయిని డిఫెండ్ చేస్తూ ప్రాసిక్యూషన్ సాక్షిని అనేకమైన 'లా'జిక్కు ప్రశ్నలు వేసి ఉక్కిరిబిక్కిరి చేశారే!? అదే లాజిక్కుని ప్రయోగించి ఆ సాధువుని "ఏయ్! నువ్వు కోవా బిళ్ళలు, విభూతి శూన్యంలోంచి ఎలా తీసేవో నేను క్రాస్ పరీక్ష చెయ్యాలి ఆగు!" అని సాధువుని నిలదీసి ఎందుకడగ లేదు? సాధుసత్తముని మేజిక్కుకి 'మహత్తు' అని అందమైన రంగు పులిమి

ఎందుకు సంతృప్తి పడుతున్నాడు? ఇవే హేతువాదుల బుర్రల్ని తొలిచేస్తున్న ప్రశ్నలు.

• ఆంధ్రజ్యోతి వీక్లీ •
*9-1-1987*